


## రాజంపేట ఏఎస్పీగా మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే



రాయచోటి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజంపేటకు ఏఎస్పీగా మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజంపేటలో ఇప్పటివరకు డీఎస్పీ స్థాయి అధికారి మాత్రమే ఉండగా ప్రభుత్వం కొత్తగా ఏఎస్పీ స్థాయి అధికారిని నియమించారు. గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్న మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేను నియమించింది.






## వైభవంగా కోదండరాముడి కల్యాణం



కల్యాణం అనంతరం ఆశీనులైన సీతారాములు

ఒంటిమిట్ట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోదండరాముడికి పౌర్ణమి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ప్రతినెలా రామాలయంలో నిర్వహించే కల్యాణ వేదికకు జిల్లా నలు మూలల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ముందుగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి ఆశీనులను చేశారు. అనంతరం కల్యాణ తంతును ప్రారంభించి ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యావచనం, కంకణ ధారణ, యజ్ఞోపవితరణ అనంతరం మాంగల్యధారణ వైష్ణవ సంప్రదాయంలో అర్చకులు నిర్వహించారు. తలంబ్రాల సమర్పణ, పూలచెండ్ల మార్పిడి కార్యక్రమాన్ని శాస్త్రీయంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి జిల్లా నలు మూలల నుంచి భక్తులు హాజరయ్యారు.

## భోగభాగ్యాల భోగి..

- జిల్లాలో వైభవంగా జరిగిన భోగి పండుగ
- ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు
- రాయచోటిలో పాల్గొన్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సంబరాల్లో తొలి ఘట్టమైన భోగి పండుగను సోమవారం జిల్లాలో ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రజల తమ ఇళ్ల ముందు భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ భోగి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఇళ్ల ముందు కట్టెలతో పాటు ఇంట్లోని పాత వస్తువులను భోగిమంటల్లో వేసి ఇప్పటి వరకు ఉన్న కష్టాలు తొలగిపోయి సంక్రాంతి పండుగతో సంక్రాంతి లక్ష్మి ప్రతి ఇంట నిలవాలని కోరుకున్నారు. భోగి మంటల్లో నీటికి కాచి పిల్లలకు స్నానాలు చేయిస్తే మంచి దన్న సెంటిమెంటుతో చాలా మంది మంటల్లో నీళ్ల కాచుకుని స్నానాలు చేశారు. పీలేరులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ముందు ఆర్య వైశ్య సంఘం, మహిళా మండలి, వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్ సభ్యులు భోగి మంటలు వేసి దాని చుట్టూ కోలా టాలతో పండుగను వైభవంగా జరుపుకు న్నారు. రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వాడవాడలాల సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



రైల్వేకోడూరులో వీధి వీధంతా భోగి మంటలు



రాయచోటిలో కుటుంబసభ్యులతో కలిసి భోగిమంట వేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పీలేరు కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘ మహిళల భోగి సంబరాలు

రాజంపేట, మదనపల్లె, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో భోగి పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రకరకాల రంగులతో ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలు పెట్టి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. ఇందులో భాగంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగ సంబరాలను ప్రారంభించారు.





## కత్తులు కట్టారు..

- భారీగా కోడిపందేలు
- చేతులు మారిన రూ.లక్షలు

రైల్వేకోడూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు జోరుగా సాగాయి. సోమవారం భోగి పండుగ సందర్భంగా జరిగిన కోడిపందేల్లో రూ.లక్షలు చేతులు మారినట్లు తెలిసింది. కోడిపందేలు జరుగుతున్న స్థావరాలు పోలీసులకు తెలిసినా దాడులు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో కోడిపందేలు ముమ్మరంగా సాగాయి. రాజకీయ నాయకుల అండతోనే పందేలు జరిగినట్లు తెలిసింది. ప్రభుత్వం కోడిపందేలకు అనుమతి ఇవ్వలేదు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కూడా జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా రైల్వేకోడూరు నియోజకవర్గంలో మాత్రం కోడిపందేలు యథేచ్ఛగా జరిగాయి. పుల్లంపేట మండలంలో ఓ హెడ్ కానిస్టేబుల్ వైసీపీ నాయకులతో కలసి అనంతసముద్రం పంచాయతీ పెద్దచెరువు తూర్పు అలుగు వద్ద భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించారని స్థానికులు తెలిపారు. గతంలో జరగని విధంగా ఈసారి కోడిపందేలు జరిగాయని కోడిపందెం రాయుళ్లు బహిరంగంగా చెబుతుండడం విశేషం. ఇదిలా ఉండగా పుల్లంపేట మండలంలో కోడిపందేలు జరుగుతున్నాయని సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తన సిబ్బందితో దాడులు చేసేందుకు వెళ్లగా అప్పటికే పందెంరాయుళ్లకు పోలీసులు వస్తున్నారన్న సమాచారం తెలియడంతో అక్కడి నుంచి పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసుల సహకారంతో ఎక్కడా కోడిపందేలు జరగవని ఎస్ఐ తెలిపారు.

## పల్లెల్లోనే పండుగంతా...

- సంక్రాంతికి పల్లెబాట పట్టిన నగరవాసులు
- బంధుమిత్రులతో కళకళలాడుతున్న పల్లెలు
- ప్రత్యేక కార్యక్రమాల్లో యువత బిజీ

8





# పల్లెల్లోనే పండుగంతా...

● సంక్రాంతికి పట్టణాల నుంచి పల్లెబాట.. ● బంధుమిత్రులతో కళకళలాడుతున్న పల్లెలు.. ● సంతోషంగా గడపడానికి యువత ప్రత్యేక కార్యక్రమాలు



నూలివీడులో చిట్లాకుప్ప వేయడానికి ట్రాక్టర్లతో కట్టెలు, కంప తెస్తున్న యువకులు

**సంక్రాంతి.. ఈ పండుగకు తెలుగు లోగిళ్లలో ఉండే ప్రత్యేకతే వేరు.. ఏరువాకలో సాగు చేసిన పంటలు పండి... ధాన్యాన్ని ఇంటికి తెచ్చిన తర్వాత.. వచ్చే మొదటి పండుగ ఇదే.. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ అంటే.. పల్లెల్లో ఒకటే హడావిడి.. కొత్త అల్లుళ్లు.. కొత్త కోడళ్ల సందడి.. కోడిపందేలు.. ఎద్దుల బండలాగుడు పోటీలు.. రంగు రంగుల ముగ్గుల పోటీలు.. గాలిపటాలు.. ఇలా ఎన్నో విశేషాలు.. ప్రత్యేకతలున్న సంక్రాంతికి.. పట్టణాల్లో ఉంటున్న వాళ్లు దాదాపు అందరూ.. పల్లెకు పోదాం..ఛలోఛలో అంటూ పల్లెలు చేరుకున్నారు. తమ స్వగ్రామాలకు చేరి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలు చేసుకుంటున్నారు.**

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి శోభ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువతీ, యువకులు ఇప్పటికే వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. వీరితో పాటు కొత్తగా పెళ్లి అయిన జంటలు, బంధుమిత్రులు అందరూ సంక్రాంతి కోసం పల్లెలకు చేరుకున్నారు. సంక్రాంతిని జరుపుకునే మూడు రోజులలో ఇప్పటికే భోగి పండుగను సంబరంగా జరుపుకున్నారు. ఇక సంక్రాంతి, కనుమ పండుగలను ఇంకా వైభవంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి రోజు భోగి మంటలు వేసి గాలిపటాలు ఎగురవేయడంతో పాటు క్రికెట్, వాలీబాల్ వంటి ఆటలను ఆడినట్లు యువకులు తెలిపారు. కనుమ రోజు పశువులను బెదిరించడానికి కాటమరాజు దగ్గర చిట్లాకుప్పను సిద్ధం చేస్తున్నారు. కొంతమంది బండలాగుడు పోటీలు నిర్వహణకు సమాయత్తమవుతున్నారు.

### ఎంతో ఘనంగా జరుపుకుంటున్నాం

**- ఆకాశ్‌వర్మ, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, రైల్వేకోడూరు**




సంక్రాంతి పండుగను ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటాం. అమెరికాలో ఇటువంటి వాతావరణం, పండుగలు జరుపుకునే వీలుండదు. ఏడాదికొకసారి సంక్రాంతి పండుగకు వచ్చి ఇక్కడ జరుపుకోవడంలో ఉన్న ఆనందం దేనిలోనూ ఉండదు. కుటుంబ సభ్యులను వదిలిపెట్టి చాలా కాలంగా ఇతర దేశాలలో ఉంటూ అక్కడ బిజీబిజీగా ఉంటాం. సంక్రాంతి పండుగ మూడు రోజులు తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉండడం చాలా సంతోషకరం.

### వేల మైళ్లు దూరం వెళ్లినా సంక్రాంతిని మర్చిపోలేము

**- అఖిల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, డల్లాస్, అమెరికా, మదనపల్లె**

చిన్నప్పుడు చిట్లాకుప్పకు అగ్గిపెట్టి మంటల చుట్టూ గంతులేసే వాళ్లం.. అనపకాయలు కాల్చుకుని తినే వాళ్లం.. ఆ జ్ఞాపకాలను మరవలేక.. అమెరికాలో ఉన్నా.. భోగి, సంక్రాంతి పండుగలు జరుపుకుంటున్నాం.. పశువులు లేవు కాబట్టి.. ఇక్కడ కనుమ చేసుకోలేము. కానీ మన రాష్ట్రంలో జరిగే కనుమ పండుగను లైవ్‌లో చూస్తాం.. మన సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోకుండా.. ప్రతి ఏటా ఇక్కడ జరుపుకుంటాం..



### కుటుంబ సభ్యులతో సంక్రాంతి జరుపుకోవడం సంతోషం

**- కోటా వెంకటమోహన్, బావులకాడపల్లె, ఎస్.సోమవారం, సంబేపల్లె**



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా బెంగళూరులో పనిచేస్తున్నాను. పండుగలు వస్తే అదో సంతోషం. కుటుంబ సభ్యులు, బంధువులతో అందరితో సంతోషంగా గడపడమే పండుగ ప్రత్యేకత. ప్రతిరోజు ఉద్యోగరీత్యా ఒడిదుడుకులు బిజీబిజీగా గడిపే మేము సంక్రాంతి వచ్చిందంటే అదో సంతోషం. ఊరికి రాగానే.. కనిపించే పెద్దలు.. పేరు పెట్టి పిలిచి.. ఎప్పుడొచ్చావు. అంటూ ఆప్యాయంగా పలకరించే వాళ్ల పిలుపులు ఆనందాన్ని ఇస్తాయి. సంక్రాంతి అనగానే.. దూర ప్రాంతాల నుంచి చిన్ననాటి స్నేహితులు ప్రతిఒక్కరూ పల్లెకు వస్తారు. వారితో సరదాగా గడుపుతాం. మూడు రోజుల పాటు ఆనందాన్ని పంచుకోవడం మరపురాని అనుభూతి.

### మూడు రోజులూ సందడే.. సందడి..

**- గణేష్‌నాయుడు, బావులకాడపల్లె, ఎస్.సోమవరం**



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా.. సంక్రాంతి వస్తోందంటే చాలు.. స్నేహితులకు ఫోన్ చేసి పండుగకు రమ్మని అందరికీ చెప్తాం.. అందరం దాదాపు పల్లెకు వస్తాం.. సంక్రాంతి మూడు రోజులూ గ్రామంలో సందడే సందడిగా గడుపుతాం. ఈ ఏడాది గ్రామంలో సందడి చేసేందుకు మహిళలకు రంగవల్లి పోటీలను కూడా నిర్వహిస్తున్నాం. బుధవారం ఈ పోటీలు నిర్వహిస్తాం. గ్రామం అంతా కలిసి మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు చేస్తాం. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గెలిచిన విజేతకు వాషింగ్ మిషన్, రెండవ బహుమతి వాటర్‌ఫిల్టర్, మూడవ బహుమతి మిక్సీ, నాలుగో బహుమతి కూలింగ్ ఫ్యాన్, ఐదవ బహుమతి ఐరన్‌బాక్స్ బహుమతులను అందిస్తాం. సంక్రాంతి మూడు రోజులు సందడిగా గడపడమే సంతోషం.



అమెరికాలోని డల్లాస్‌లో భోగి వేడుకల్లో స్నేహితులతో మదనపల్లెకు చెందిన అఖిల్





కోడిపుంజుతో.. సరదాగా.. (గాలివీడు)



### సంక్రాంతి అంటేనే.. సంబరాలు

**- నవ్యశ్రీ తేజ, న్యాయవిద్యార్థి, చిన్నమండెం**

పండుగలు ఎన్నో ఉంటాయి. అయితే సంక్రాంతి అంటే చాలా ఇష్టం. ఈ పండుగకు ఎక్కడో దూరంగా ఉన్న మా బంధువులు అందరూ వచ్చారు. నేను తిరుపతి మహిళా యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదువుతున్నాను. సంక్రాంతి కోసం సొంత ఊరికి వచ్చాను. ఈ మూడు రోజులు అందరం సంతోషంగా పండుగను జరుపుకుంటాము.. మా అమ్మ వాళ్లు ఇప్పటికే పిండివంటలు తయారు చేశారు. కనుమ రోజు చిట్లాకుప్ప దగ్గరకు వెళ్తాం.

### చిన్ననాటి జ్ఞాపకాలు మదిలో పదిలం



**- రెడ్డిశేఖర్, వంకోళ్లపల్లె, చిన్నమండెం**

నేను బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాను. బెంగళూరు సిటీలో సంక్రాంతి పండుగ వాతావరణం ఉండదు. దీంతో ఐదు రోజులు సెలవు తీసుకుని ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి పిండివంటలు చేస్తున్నాము. గతంలో మాకు ఎద్దులు ఉండేవి. మా చిన్నతనంలో కనుమ రోజు ఉదయాన్నే లేచి ఎద్దులకు స్నానాలు చేయించి.. కొమ్ములను రంగురంగుల పేపర్లతో అలంకరించే వాళ్లం. వీటితో పాటు మెడలో మూగపట్టీలు వేసి.. నుదుట బిల్లలు కట్టి కొమ్ములకు రంగుల బుడ్డలు కూడా అలంకరించే వాళ్లం. అలా అలంకరించిన ఎద్దులను చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్లి బెదిరించే వాళ్లం. నేను 14 సంవత్సరాలుగా బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తూ. ప్రతి పండుగకు తప్పనిసరిగా ఇంటికి వచ్చి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను జరుపుకుంటాము. చిన్ననాటి సంక్రాంతి జ్ఞాపకాలు ఎప్పటికీ మదిలో పదిలంగానే ఉంటాయి.

### సంక్రాంతి పండుగ అంటే. ఉరకలేస్తాం

**- దక్షిరాజు కిరణ్‌కుమార్, మాధవరం పోడు, రైల్వేకోడూరు**



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఉరకలేస్తూ స్వగ్రామానికి చేరుకుంటాం. కుటుంబ సభ్యులందరం కలిసి కొత్తబట్టలు కొనుగోలు చేసి భోగి పండుగ నుంచి మూడు రోజుల పాటు వాటిని ధరించి పిల్లలతో ఆనందంగా గడుపుతాం. కుటుంబ సభ్యులతో కలిసి పలు రకాల పిండి వంటలు తింటూ ఉంటే.. అందులో ఉండే గమ్మత్తు వేరుగా ఉంటుంది. ఎప్పుడూ కంప్యూటర్ దగ్గర కూర్చుని ఉద్యోగం చేసుకుంటూ బిజీబిజీగా ఉండే సమయాన్ని విడిచిపెట్టి.. సుమారు నాలుగు రోజుల పాటు. సంక్రాంతి శోభను చూస్తుంటే.. ఆనందడోలికల్లో మునిగిపోతాం.

---

## సంక్రాంతి సంబరాల్లో న్యాయమూర్తి



భోగి మంటల వద్ద కుటుంబ సభ్యులతో న్యాయమూర్తి శిరీష్

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని బొజ్జవారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మదనపల్లిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి నాదేళ్ల శిరీష్ పాల్గొన్నారు. బొజ్జవారిపల్లెకు చెందిన రిటైర్డు ఆర్టీసీ అధికారి సుబ్బన్న, శ్రీదేవి దంపతుల కుమార్తె సులక్షణతో నాదేళ్ల శిరీష్‌కు వివాహమైంది. పండుగ సందర్భంగా అత్తగారి ఊరికి చేరుకున్న న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటల్లో పాల్గొన్నారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండ్లబండిలో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో తిరిగి సందడి చేశారు.

## వైభవంగా రంగనాథస్వామి కల్యాణం

నందలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశస్వామి ఆలయంలో సోమవారం యంబలూరు అనిల్‌కుమార్, రాధిక దంపతుల ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లె మోహన్, సుబ్బరాయుడు, శ్రీను, సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈ కల్యాణానికి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ వారు సహకరించారు.

## వీరభద్రాలయంలో ఘనంగా పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం భోగి పండుగ, పౌర్ణమి సందర్భంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి బ్యాండు మేళాలతో మాడవీధుల్లో పల్లకిపై ఊరేగించారు. ఆలయ ఈవో టీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు పాల్గొన్నారు.

## 12 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

● 28 దుంగలు స్వాధీనం

పుల్లంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని అనంత సముద్రం సమీపంలో కందిరీగల గుట్ట వద్ద మండలానికి చెందిన 12 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి 28 దుంగలను స్వాధీనం చేసకున్నామన్నామని రాజంపేట డీఎస్పీ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో వీరిని పట్టుకుని వారి నుంచి 28 దుంగలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. పట్టుబడ్డ దుంగల విలువ 8 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుంటే ఎంతటివారినైన వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, నందలూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక్కడ పల్లెపండుగ లేదా...?

● అధ్వానంగా రోడ్లు

● వాహనదారులకు తప్పని కష్టాలు

● ప్రభుత్వం నిధులు ఇచ్చినా ఫలితం శూన్యం

● ప్రభుత్వ ఆశయానికి తూట్లు



గుంతలుగా మారి వర్షపు నీటితో నిండిన అగ్రహారం నుంచి బలిజపల్లెకు వెళ్లే మట్టి రోడ్డు

సుండుపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ నిర్వాకంతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతల మయంగా మారాయి. అభివృద్ధి తుంగలో తొక్కి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్భాటం ప్రకటలనకే పరిమితమైంది. ఇందుకు ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండుగ నాటికి పట్టణాల నుంచి పల్లెలకు వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా పూర్తి చేయాలని పల్లె పండుగ పేరిట కోట్లాది రూపాయల నిధులను విడుదల చేశారు. గత ప్రభుత్వంలో తప్పులు జరిగాయి. ఆ తప్పులను పూడ్చేందుకు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులు, పాలకులను భాగస్వాములను చేస్తూ రోడ్లు వేసేందుకు నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్ల పల్లె పండుగ పేరిట రోడ్లు వేసి గుంతలు లేకుండా చేస్తున్నారు. అయితే సుండుపల్లె మండలంలో మాత్రం పల్లెపండుగ పనులు ప్రారంభం కాలేదు. సుండుపల్లె మండలంలో రోడ్లు వేసేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులను విడుదల చేశారు. అయినా పనులు ప్రారంభించకపోవడంతో పండుగకు పల్లెలకు వచ్చే స్థానికులు, అతిథులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

### గతంలో హైరానా

సుండుపల్లె మండల కేంద్రంలో సీసీ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, మట్టి రోడ్లు గుంతల మయంగా మారడంతో మండల కేంద్రానికి వచ్చే వారు. పోయేవారు అష్టకష్టాలు పడుతున్నారు. సుండుపల్లె, రాయవరం ప్రధాన రహదారిలో కెనరా బ్యాంకు సమీపంలో ఇళ్లలోని మురికినీరు, వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఎంపీడీవో ఆఫీసు నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో సీసీ రోడ్లు పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి ప్రయాణికులు కిందపడి గాయాలపాలువుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అగ్రహారం నుంచి ఏటిగడ్డరాచపల్లి, బలిజపల్లె, సామిసేనిగడ్డ ఇతర పల్లెలకు వెళ్లే రోడ్లు సుమారు ఐదు కిలోమీటర్ల వరకు గుంతలుగా మారింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర నుంచి సాకలపల్లి, కుమ్మరపల్లి, కొత్త వడ్డెపల్లె, రవీంద్రనాధ్‌రెడ్డి కాలనీ, పోచంపల్లి, పోచంవాండ్లపల్లె, ఎల్లారెడ్డిగారిపల్లెలకు వెళ్లే రహదారులు, అంతేగాకుండా పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బత్రాజుగారిపల్లెకు వెళ్లే మట్టి రోడ్లు దశాబ్దాల కాలంగా మట్టి రోడ్లగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో రోడ్లు వేస్తామని తవ్వి గుంతల మయంగా మార్చేశారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా మండల కేంద్రంలో కూడా ఆరెమ్మ వీధి, ఇందిరానగర్, జనార్ధన్‌నగర్ కాలనీలో ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. అంతేగాకుండా మూడు సంవత్సరాల క్రితం రాయచోటి నుంచి సుండుపల్లెకు డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అటవీ ప్రాంతంలో అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం పల్లె పండుగ పేరిట నిధులు విడుదల చేసింది. ఈ ప్రభుత్వంలోనైనా రోడ్లు వేస్తారని భావించాము. నిధులు వచ్చినా పనులు ప్రారంభించకపోవడం బాధాకరం అని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలో పనులు ప్రారంభిస్తాము

**-సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె**

త్వరలో పల్లె పండుగ పనులు ప్రారంభిస్తాము. సుండుపల్లె మండలానికి రూ.1.50 కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించింది. పనులు గుర్తించాము. ప్రధాన రోడ్ల సమస్యలు పరిష్కరిస్తాము.

### అప్పుడు ప్రారంభించారని ఆపేశారు

2018 అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ ఆర్‌కే రోడ్డు నుంచి పూజారివాండ్లపల్లె వరకు 1.40 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటుకు రూ.56 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. మూడుచోట్ల కల్వర్టులు నిర్మించారు. సుమారు రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించి పనులు చేశారు. మడితాడు గ్రామంలోని రాయవరం రోడ్డు నుంచి నాయునివారిపల్లెకు పోయే రహదారిలో రూ.62 లక్షలతో 1.50 కిలోమీటర్లు రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.34 లక్షలు వెచ్చించి పనులు చేశారు. అలాగే జీకే రాచపల్లె సమీపంలో రాయవరం రోడ్డు నుంచి కోనేరువాండ్లపల్లెకు రూ.58 లక్షలతో 1.05 కిలోమీటర్లు రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.24 లక్షలు వెచ్చించి పనులు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులన్నింటినీ రద్దు చేసింది. దీంతో రహదారి పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వైసీపీ ప్రభుత్వం రాగానే అర్ధంతరంగా ఆపేసిన రోడ్డు పనులు

### పల్లె పండుగకు రాజకీయ గ్రహణం

వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేవని ప్రభుత్వం ఇవ్వడం లేదని, అభివృద్ధి కుంటుపడిందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా నిధులు విడుదల చేశారు. అందులో భాగంగా సుండుపల్లె మండలానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. నిధులు వచ్చాయని సంబరపడే లోపు టీడీపీలోని నియోజకవర్గ కీలక నేతల మధ్య సఖ్యత లేకపోవడం వలన పల్లె పండుగ పనులు ప్రారంభం కాలేదు. సంక్రాంతి పండుగలోపు గుంతలు లేని రోడ్డుగా మార్చాలని పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేసినా ఇక్కడ మాత్రం పనులే ప్రారంభం కాలేదు. నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఇప్పటికి దాదాపు రోడ్లు పూర్తయ్యేవి. గత ప్రభుత్వంలో చేయలేదని విమర్శిస్తున్నారు. కానీ ఈ ప్రభుత్వంలో నిధులు విడుదల చేసినా పనులు చేయడం లేదని టీడీపీ నేతల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశించినా పనులు చేయకపోవడం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు కూటమి నాయకులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సంక్రాంతి
మరియు జన్మదిన
శుభాకాంక్షలు.
RISING ANDHRA
SHINING ANDHRA
ప్రజా సంక్షేమమే లక్ష్యంగా , చితూరు అభివృద్ధికి నిరంతరం
శ్రామికుడి లాగా ముందుకు సాగుతున్న
చిత్తూరు శాసనసభ్యులు మా ఆత్మీయసోదరుడు
శ్రీ గురజాల జగన్మోహన్ గారికి
హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు.
N AVENUE BY KONDA & GJM , NUTRINE FACTORY COMPOUND , CHITTOOR
LAUNCHING SOON...
N AVENUE :
* Mall
* 3 Star Hotel
* Luxuary villas
* Commercial Space
* High Rise Appartments
మీ...
కొండా నరేంద్ర MS USA
గోబ్లల్ వెస్ ప్రెసిడెంట్ NIVIDIA సిలికాన్ వ్యాలి ,USA
ప్రముఖ పారిశ్రామిక వేత్త , ప్రకృతి వ్యవసాయ నిపుణులు
తంబళ్ళపల్లి నియోజకవర్గం

## మృత్యుంజయేశ్వరస్వామికి రుద్రాభిషేకం

నందలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పౌర్ణమి సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ మృత్యుంజయేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. భోగి పండుగ సందర్భంగా భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు.

## కుమ్మరపల్లి వీఆర్ఏ మృతి

రామాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లె గ్రామ సేవకుడు భాస్కర్ (50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. విజయభాస్కర్ కొద్దికాలం మండల గ్రామసేవకుల సంఘం అధ్యక్షుడుగా కొనసాగారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమర్ఖ్ ఖాదన్ అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు.

## పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు/ ఓబులవారిపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తనం కారణంగా సోమవారం సాయంత్రం పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పండుగ పూట వర్షం కురవడంతో ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. మహిళలు ఇళ్ల ముందు వేసిన ముగ్గులు వర్షం కారణంగా పాడై పోయాయి. క్రికెట్ పోటీలు తాత్కాలికంగా వాయిదాపడ్డాయి. బంధుమిత్రులతో ఆనందంగా గడుపుదామని దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న పలువురు చలి కారణంగా బయటకు రాలేక ఇళ్లలోనే గడిపారు. ఇదిలా ఉండగా ఇదే పరిస్థితి కొనసాగితే పండుగ సంబరం ఉండదని ప్రజలు అనుకుంటున్నారు.

# వాడవాడలా భోగి వేడుకలు



శిబ్యాల గ్రామంలో భోగిమంటలు వేస్తున్న గ్రామస్తులు | రాజంపేటలో ముస్తాబైన గొబ్బెమ్మ | ఆకేపాడు గ్రామంలో గొబ్బిళ్లు తడుతున్న మహిళలు

రాయచోటిటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇళ్ల ముందు భోగిమంటలు వేసి పండుగ సంబరాలకు స్వాగతం పలికారు. ఇంట్లోని పాత వస్తువులను వేసి మంటల్లో వేసి ఇప్పటి వరకు ఉన్న కష్టాలు తొలగిపోయి సంక్రాంతి లక్ష్మి ప్రతి ఇంట నిలవాలని కోరుకున్నారు. మహిళలు ముత్యాల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగ సంబరాలను ప్రారంభించారు.

**రాజంపేట:** సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం వేకువజామునే పెద్దఎత్తున ప్రజలు భోగిమంటలు వేశారు. ప్రతి ఇంటి ముంగిట ముగ్గులు వేశారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తదితర ప్రజా ప్రతినిధులు తమకుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు గొబ్బెళ్లు తడుతూ కొత్త ఉత్సాహాన్ని నింపారు. పిల్లలు ఆయా గ్రామాల్లో తిరుగుతూ గొబ్బెమ్మకు పూజలు నిర్వహించి గొబ్బిళ్ల పాటలు పాడుతూ గ్రామాల్లో కొత్తశోభను తెచ్చారు.

**గాలివీడు:** మండలంలో ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముందర రంగవల్లులు వేసి అందులో గొబ్బెమ్మలను ఉంచారు. కొంత మంది యువకులు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, గాలిపటాలు ఎగురవేయడం వంటి ఆటలను ఆడగా, యువతులు ఉయ్యాలలు, తొక్కుడ బిళ్ల ఆడుకున్నారు.

**రైల్వేకోడూరు:** రైల్వేకోడూరులోని పలు ప్రాంతాల్లో ప్రజలు భోగిమంటలు వేశారు. చిన్నలు, పెద్దలు కొత్త బట్టలు ధరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా అదే సమయంలో వర్షం కురిసి మంటలు ఆరిపోవడంతో ప్రజలు కాస్త ఆందోళనకు గురయ్యారు.

**నందలూరు:** మండలంలోని ప్రజలు సోమవారం తెల్లవారు జామున భోగి మంటలు వేశారు. ఆ మంటల్లో నీటిని కాచుకొని స్నానాలు చేశారు. మహిళలు ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నైతో పాటు ఇతర దేశాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు చేరుకున్నారు.

**సిద్దవటం:** సిద్దవటం మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పెద్దలు, పిల్లలు భోగి మంటలు వేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. బంధుమిత్రులతో పల్లె ప్రాంతాలు కిటకిటలాడాయి.

**సంబేపల్లె:** మండలంలో భోగి రోజు పోసిన అట్లు పశువులకు తినిపించారు. ఇంటికి చేరిన ఆడపడుచులు కొత్తగా వచ్చిన అల్లుళ్లు, బంధువులు, కుటుంబ సభ్యులుప్రతి ఒక్కరూ కొత్త బట్టలు ధరించి సంతోషంగా గడుపుతున్నారు.

**చిట్వేలి:** మండలంలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

# ట్రూఅప్ చార్జీల భారం తగ్గించాలి

● విద్యుత్ బిల్లులు దహనం చేసిన సీపీఎం నేతలు



రాయచోటి:విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

రాయచోటిటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల మీద మోపిన 20 వేల కోట్ల విద్యుత్ ట్రూఅప్ చార్జీల తగ్గించాలని జిల్లా సీపీఎం కమిటీ సభ్యులు అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం భోగి పండుగ సందర్భంగా పాత రాయచోటిలో మున్సిపల్ కార్మికుల కుటుంబాలతో కలిసి విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెట్టరాదని, విద్యుత్ భారాల తీవ్రత కారణంగా వైసీపీ 151 సీట్ల నుంచి 11కు చేరి ఘోర ఓటమి పాలయ్యిందన్న విషయం గ్రహించాలన్నారు. వెంటనే విద్యుత్, ఆర్టీసీ, టోల్‌గేట్, టీఎస్‌టీ, పెట్రోల్, గ్యాస్, డీజిల్, వంట నూనెలు తదితరాల ధరలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించక పోతే వైసీపీ పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందన్నారు. మున్సిపల్ కార్మిక నేతలు చెన్నయ్య, అశోక్, మాధవి, అంజనమ్మ, రాణి, హరి, మహమ్మద్ పాల్గొన్నారు.

**రాజంపేట టౌన్:** సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్వేలి రవి కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, ఆదానితో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల కారణంగా సామాన్యులకు విద్యుత్ బిల్లులు భారంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచడం తగదన్నారు. వెనువెంటనే విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. హరినాథ్, ఉమా మహేశ్వరి, సుజాత, కళ్యాణి, సంయుక్త, కిషోర్, కార్తీక్; బాను తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



# ఆకేపాడులో బండలాగుడు పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన ఎద్దుల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకేపాడులో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో ఆలంఖాన్‌పల్లె వెంకటరామి రెడ్డి, రూకవారిపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి ఎద్దులు 4800 మీటర్లు బండను లాగి ప్రథమ బహుమతి కింద 50 వేల రూపాయల నగదును గెలుచుకున్నారు. రెండో బహుమతికి కింద వంశీరెడ్డి హేమంత్‌రెడ్డికి చెందిన ఎద్దులు కైవసం చేసుకుని 40 వేల రూపాయల బహుమతి సాధించారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులు మూడో బహుమతిని పొంది 30 వేల రూపాయలను కైవసం చేసుకున్నాయి. విశ్వనాథ్‌రెడ్డి ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి 20 వేల రూపాయలు, డి.భావన, ఖాదర్‌ఖాన్ ఎద్దులు 5వ బహుమతిని పొంది 10 వేల రూపాయల బహుమతిని పొందారు. పాల్గొన్న వారందరికి 5 వేల రూపాయల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, రాజంపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ మాజీ ఎంపీ వెంకటరెడ్డి, మాసీమ బాబు, రైతు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 15 నుంచి పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు



పీరయ్యస్వామి పీఠం

చిన్నమండెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికోన గ్రామ పంచాయతీ చిన్నర్సుపల్లెలో ఈ నెల 15, 16 తేదీల్లో సద్గురు చిన్నమండెం పీరయ్య స్వాముల వారి 219వ ఆరాధన మహోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పీఠాధిపతి నాగలింగమయ్య స్వాములు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఐదు గంటలకు అభిషేకం, పుష్పాలంకరణ, పూజలు, రాత్రి 7 గంటలకురాష్ట్ర మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పేరయ్యస్వామి సుప్రభాత పుస్తకావిష్కరణ చేస్తారన్నారు. చెక్కభజనలు, కోలాటం, అఖండ భజన ఆర్కెస్ట్రా ఉంటాయని గురువారం ఉదయం 6 గంటలకు మౌలాలి జెండా మెరవణి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## బొప్పాయి తోటపై అడవి పందుల దాడి

చిట్వేలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మైలపల్లె పంచాయతీ ఎం.రాచపల్లిలో ఈశ్వరరాజుకు చెందిన 5500 బొప్పాయి మొక్కలను ఆదివారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో రైతుకు 80 వేల నుంచి లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతుకు పొలం ఖాళీగా కనిపించింది. ఎఫ్‌బీవో కరీం సంఘటన స్థలాన్ని పరిశీ లించారు. ఉన్నతాధికారులకు నివేదించి పంట నష్టం అందేలా కృషి చేస్తానని రైతుకు హామీ ఇచ్చారు.

## అక్రమంగా గ్రావెల్ తరలింపు

సిద్దవటం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లె గ్రామం సర్వేనంబరు 421లోని గ్రావెల్‌ను సెలవు దినాలు, రాత్రి వేళల్లో పలువురు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసు కోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై వీఆర్వో శివశంకర్ మాట్లాడుతూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.



## మంత్రికి భోగి శుభాకాంక్షలు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

చిన్నమండెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి చిన్న మండెం మండలం బోరెడ్డి గారిపల్లెలోని ఆయన నివా సంలో పలువురు ప్రజా ప్రతి నిధులు,ప్రజలు పుష్పగుచ్చాలు అందజేసి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇల్లు శాంతి సౌభాగ్యాలతో వెలుగొందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**రాయచోటి టౌన్:** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) డైరీ, క్యాలెండర్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకొని మంత్రి ఏపీటీఎఫ్ డైరీ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబు, శ్రీనివాసులు, రాయచోటి, వీరబల్లి మండల నాయకులతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బకాయిలు చెల్లించడంపై హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన బకాయిలు కూడా చెల్లించాలని, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు.

## 'డాకు మహారాజ్' విజయోత్సవాలు

రైల్వేకోడూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్ధేశ్వర థియేటర్‌లో సోమవారం నిర్వహించిన డాకు మహారాజ్ విజయోత్సవ సభలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు పాల్గొన్నారు. భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, ఓబులవారిపల్లి జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడోరి రమణ, మైనారిటీ సీనియర్ నాయకులు పట్టాన్ మౌలా(అల్లాబకష్), యువ నాయకులు బాలిశెట్టి హరికృష్ణ రాయల్, బాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు తేనేపల్లి రసూల్, సీనియర్ నాయకులు మందల కొండయ్య, ఎస్సీ సెల్ నాయకులు తేనేపల్లి చిన్న, మాదిగ రంగనాథ్ టీడీపీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్యకు ఘన నివాళి



పసుపులేటి బ్రహ్మయ్య జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నేతలు

రాజంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య జయంతి సందర్భంగా ఆయన కుమారుడు పసుపు లేటి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బ్రహ్మయ్య చిత్రపటాని కి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. ప్ర భుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, రాజంపేట మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పొరా సుబ్బానాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్ తదితరులు మాట్లాడుతూ మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా రాజంపేటను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. పసుపులేటి ఫౌండేషన్ ట్రస్టు ద్వారా తమ సొంత గ్రామం పొత్తపిలో శ్రీమతి సరస్వతి పేరిట ఉన్నత పాఠశాలను నెలకొల్పారన్నారు. నేడు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న భువనగిరి పల్లె లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ల చంద్రమౌళి, రవి. డాక్టర్ తోట రామయ్య, బండారు బాలయ్య, ఇడిమడకల కుమార్, మలిశెట్టి సుబ్బరాయుడు, ఎంఎల్ నారాయణ, మనుబోలు వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి సుబ్రమణ్యం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## దుస్తుల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ప్రముఖ జీఎస్‌నాయుడు, ట్రస్టు చైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి

రాజంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం ఆకేపాడు గ్రామంలో ఆకేపాటి గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం సుమారు 10 గ్రామ పంచాయతీల ప్రజలకు దుస్తులు రాష్ట్ర టీడీపీ సీనియర్ నాయకుడు, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎస్‌నాయుడు పంపిణీ చేశారు. ఉదయం పురుషులకు చొక్కా, పంచె, టవల్, మధ్యాహ్నం మహిళలకు చీరలు పంపిణీ చేసి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీఎస్ నాయుడు మాట్లాడుతూ తాను, ఆకేపాటి గోపాల్‌రెడ్డి తెలుగుదేశంపార్టీలో చురుగ్గా పనిచేశామని, ఈ ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆయన కుమారుడు ట్రస్టు చైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డిలు అదే సేవా దృక్పథంతో తన తండ్రి గోపాల్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకటనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడారు సుబ్రమణ్యంనాయుడు, రైల్వేకోడూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఆకేపాటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు వృథా



రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

సిద్దవటం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పైపు పగిలిపోయి నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మాధవరం-1 గ్రామ ప్రజలు అంటున్నారు. గ్రామంలోని 16వ నంబరు రోడ్డులో పది రోజుల క్రితం పైపులైను పగిలిపోవడంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. తాగునీరు వృథా చేయవద్దని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఆచరణలో కానరాడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతి సెక్రటరీ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ ఆ ప్రాంతాన్ని అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీ లించాడని, సంక్రాంతి కారణంగా కూలీలు రావడంలేదని, పండుగ అనంత రం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పల్లెల్లోనే పండుగంతా...

● సంక్రాంతికి పట్టణాల నుంచి పల్లెబాట.. ● బంధుమిత్రులతో కళకళలాడుతున్న పల్లెలు.. ● సంతోషంగా గడపడానికి యువత ప్రత్యేక కార్యక్రమాలు

**సంక్రాంతి.. ఈ పండుగకు తెలుగు లోగిళ్లలో ఉండే ప్రత్యేకతే వేరు.. ఏరువాకలో సాగు చేసిన పంటలు పండి... ధాన్యాన్ని ఇంటికి తెచ్చిన తర్వాత.. వచ్చే మొదటి పండుగ ఇదే.. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ అంటే.. పల్లెల్లో ఒకటే హడావిడి.. కొత్త అల్లుళ్లు.. కొత్త కోడళ్ల సందడి.. కోడిపందేలు.. ఎద్దుల బండలాగుడు పోటీలు.. రంగు రంగుల ముగ్గుల పోటీలు.. గాలిపటాలు.. ఇలా ఎన్నో విశేషాలు.. ప్రత్యేకతలున్న సంక్రాంతికి.. పట్టణాల్లో ఉంటున్న వాళ్లు దాదాపు అందరూ.. పల్లెకు పోదాం..ఛలోఛలో అంటూ పల్లెలు చేరుకున్నారు. తమ స్వగ్రామాలకు చేరి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలు చేసుకుంటున్నారు.**

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి శోభ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువతీ, యువకులు ఇప్పటికే వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. వీరితో పాటు కొత్తగా పెళ్లి అయిన జంటలు, బంధుమిత్రులు అందరూ సంక్రాంతి కోసం పల్లెలకు చేరుకున్నారు. సంక్రాంతిని జరుపుకునే మూడు రోజులలో ఇప్పటికే భోగి పండుగను సంబరంగా జరుపుకున్నారు. ఇక సంక్రాంతి, కనుమ పండుగలను ఇంకా వైభవంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి రోజు భోగి మంటలు వేసి గాలిపటాలు ఎగురవేయడంతో పాటు క్రికెట్, వాలీబాల్ వంటి ఆటలను ఆడినట్లు యువకులు తెలిపారు. కనుమ రోజు పశువులను బెదిరించడానికి కాటమరాజు దగ్గర చిట్లాకుప్పను సిద్ధం చేస్తున్నారు. కొంతమంది బండలాగుడు పోటీలు నిర్వహణకు సమాయత్తమవుతున్నారు.

### ఎంతో ఘనంగా జరుపుకుంటున్నాం

**- ఆకాశ్‌వర్మ, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, రైల్వేకోడూరు**



సంక్రాంతి పండుగను ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటాం. అమెరికాలో ఇటువంటి వాతావరణం, పండుగలు జరుపుకునే వీలుండదు. ఏడాదికొకసారి సంక్రాంతి పండుగకు వచ్చి ఇక్కడ జరుపుకోవడంలో ఉన్న ఆనందం దేనిలోనూ ఉండదు. కుటుంబ సభ్యులను వదిలిపెట్టి చాలా కాలంగా ఇతర దేశాలలో ఉంటూ అక్కడ బిజీబిజీగా ఉంటాం. సంక్రాంతి పండుగ మూడు రోజులు తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉండడం చాలా సంతోషకరం.



నూలివీడులో చిట్లాకుప్ప వేయడానికి ట్రాక్టర్లతో కట్టెలు, కంప తెస్తున్న యువకులు

### కుటుంబ సభ్యులతో సంక్రాంతి జరుపుకోవడం సంతోషం

**- కోటా వెంకటమోహన్, బావులకాడపల్లె, ఎస్.సోమవారం, సంబేపల్లె**




సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా బెంగళూరులో పనిచేస్తున్నాను. పండుగలు వస్తే అదో సంతోషం. కుటుంబ సభ్యులు, బంధువులతో అందరితో సంతోషంగా గడపడమే పండుగ ప్రత్యేకత. ప్రతిరోజు ఉద్యోగరీత్యా ఒడిదుడుకులు బిజీబిజీగా గడిపే మేము సంక్రాంతి వచ్చిందంటే అదో సంతోషం. ఊరికి రాగానే.. కనిపించే పెద్దలు.. పేరు పెట్టి పిలిచి.. ఎప్పుడొచ్చావు. అంటూ ఆప్యాయంగా పలకరించే వాళ్ల పిలుపులు ఆనందాన్ని ఇస్తాయి. సంక్రాంతి అనగానే.. దూర ప్రాంతాల నుంచి చిన్ననాటి స్నేహితులు ప్రతిఒక్కరూ పల్లెకు వస్తారు. వారితో సరదాగా గడుపుతాం. మూడు రోజుల పాటు ఆనందాన్ని పంచుకోవడం మరపురాని అనుభూతి.

### వేల మైళ్లు దూరం వెళ్లినా సంక్రాంతిని మర్చిపోలేము

**- అఖిల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, డల్లాస్, అమెరికా, మదనపల్లె**

చిన్నప్పుడు చిట్లాకుప్పకు అగ్గిపెట్టి మంటల చుట్టూ గంతులేసే వాళ్లం.. అనపకాయలు కాల్చుకుని తినే వాళ్లం.. ఆ జ్ఞాపకాలను మరవలేక.. అమెరికాలో ఉన్నా.. భోగి, సంక్రాంతి పండుగలు జరుపుకుంటున్నాం.. పశువులు లేవు కాబట్టి.. ఇక్కడ కనుమ చేసుకోలేము. కానీ మన రాష్ట్రంలో జరిగే కనుమ పండుగను లైవ్‌లో చూస్తాం.. మన సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోకుండా.. ప్రతి ఏటా ఇక్కడ జరుపుకుంటాం..





అమెరికాలోని డల్లాస్‌లో భోగి వేడుకల్లో స్నేహితులతో మదనపల్లెకు చెందిన అఖిల్





కోడిపుంజుతో.. సరదాగా.. (గాలివీడు)

### మూడు రోజులూ సందడే.. సందడి..

**- గణేష్‌నాయుడు, బావులకాడపల్లె, ఎస్.సోమవరం**



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా.. సంక్రాంతి వస్తోందంటే చాలు.. స్నేహితులకు ఫోన్ చేసి పండుగకు రమ్మని అందరికీ చెప్తాం.. అందరం దాదాపు పల్లెకు వస్తాం.. సంక్రాంతి మూడు రోజులూ గ్రామంలో సందడే సందడిగా గడుపుతాం. ఈ ఏడాది గ్రామంలో సందడి చేసేందుకు మహిళలకు రంగవల్లి పోటీలను కూడా నిర్వహిస్తున్నాం. బుధవారం ఈ పోటీలు నిర్వహిస్తాం. గ్రామం అంతా కలిసి మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు చేస్తాం. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గెలిచిన విజేతకు వాషింగ్ మిషన్, రెండవ బహుమతి వాటర్‌ఫిల్టర్, మూడవ బహుమతి మిక్సీ, నాలుగో బహుమతి కూలింగ్ ఫ్యాన్, ఐదవ బహుమతి ఐరన్‌బాక్స్ బహుమతులను అందిస్తాం. సంక్రాంతి మూడు రోజులు సందడిగా గడపడమే సంతోషం.

### సంక్రాంతి అంటేనే.. సంబరాలు

**- నవ్యశ్రీ తేజ, న్యాయవిద్యార్థి, చిన్నమండెం**



పండుగలు ఎన్నో ఉంటాయి. అయితే సంక్రాంతి అంటే చాలా ఇష్టం. ఈ పండుగకు ఎక్కడో దూరంగా ఉన్న మా బంధువులు అందరూ వచ్చారు. నేను తిరుపతి మహిళా యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదువుతున్నాను. సంక్రాంతి కోసం సొంత ఊరికి వచ్చాను. ఈ మూడు రోజులు అందరం సంతోషంగా పండుగను జరుపుకుంటాము.. మా అమ్మ వాళ్లు ఇప్పటికే పిండివంటలు తయారు చేశారు. కనుమ రోజు చిట్లాకుప్ప దగ్గరకు వెళ్తాం.

### చిన్ననాటి జ్ఞాపకాలు మదిలో పదిలం

**- రెడ్డిశేఖర్, వంకోళ్లపల్లె, చిన్నమండెం**



నేను బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాను. బెంగళూరు సిటీలో సంక్రాంతి పండుగ వాతావరణం ఉండదు. దీంతో ఐదు రోజులు సెలవు తీసుకుని ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి పిండివంటలు చేస్తున్నాము. గతంలో మాకు ఎద్దులు ఉండేవి. మా చిన్నతనంలో కనుమ రోజు ఉదయాన్నే లేచి ఎద్దులకు స్నానాలు చేయించి.. కొమ్ములను రంగురంగుల పేపర్లతో అలంకరించే వాళ్లం. వీటితో పాటు మెడలో మూగపట్టీలు వేసి.. నుదుట బిల్లలు కట్టి కొమ్ములకు రంగుల బుడ్డలు కూడా అలంకరించే వాళ్లం. అలా అలంకరించిన ఎద్దులను చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్లి బెదిరించే వాళ్లం. నేను 14 సంవత్సరాలుగా బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తూ.. ప్రతి పండుగకు తప్పనిసరిగా ఇంటికి వచ్చి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను జరుపుకుంటాము. చిన్ననాటి సంక్రాంతి జ్ఞాపకాలు ఎప్పటికీ మదిలో పదిలంగానే ఉంటాయి.

### సంక్రాంతి పండుగ అంటే. ఉరకలేస్తాం

**- దక్షిరాజు కిరణ్‌కుమార్, మాధవరం పోడు, రైల్వేకోడూరు**



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఉరకలేస్తూ స్వగ్రామానికి చేరుకుంటాం. కుటుంబ సభ్యులందరం కలిసి కొత్తబట్టలు కొనుగోలు చేసి భోగి పండుగ నుంచి మూడు రోజుల పాటు వాటిని ధరించి పిల్లలతో ఆనందంగా గడుపుతాం. కుటుంబ సభ్యులతో కలిసి పలు రకాల పిండి వంటలు తింటూ ఉంటే.. అందులో ఉండే గమ్మత్తు వేరుగా ఉంటుంది. ఎప్పుడూ కంప్యూటర్ దగ్గర కూర్చుని ఉద్యోగం చేసుకుంటూ బిజీబిజీగా ఉండే సమయాన్ని విడిచిపెట్టి.. సుమారు నాలుగు రోజుల పాటు. సంక్రాంతి శోభను చూస్తుంటే.. ఆనందడోలికల్లో మునిగిపోతాం.

## సంక్రాంతి సంబరాల్లో న్యాయమూర్తి



భోగి మంటల వద్ద కుటుంబ సభ్యులతో న్యాయమూర్తి శిరీష్

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని బొజ్జవారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మదనపల్లిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి నాదెళ్ల శిరీష్ పాల్గొన్నారు. బొజ్జవారిపల్లెకు చెందిన రిటైర్డు ఆర్టీసీ అధికారి సుబ్బన్న, శ్రీదేవి దంపతుల కుమార్తె సులక్షణతో నాదెళ్ల శిరీష్‌కు వివాహమైంది. పండుగ సందర్భంగా అత్తగారి ఊరికి చేరుకున్న న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటల్లో పాల్గొన్నారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండ్ల బండిలో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో తిరిగి సందడి చేశారు.

## వైభవంగా రంగనాథస్వామి కల్యాణం

నందలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశస్వామి ఆలయంలో సోమవారం యంబలూరు అనిల్‌కుమార్, రాధిక దంపతుల ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లె మోహన్, సుబ్బరాయుడు, శ్రీను, సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈ కల్యాణానికి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ వారు సహకరించారు.

## వీరభద్రాలయంలో ఘనంగా పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం భోగి పండుగ, పౌర్ణమి సందర్భంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి బ్యాండు మేళాలతో మాడవీధుల్లో పల్లకిపై ఊరేగించారు. ఆలయ ఈవో టీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు పాల్గొన్నారు.

## 12 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

● 28 దుంగలు స్వాధీనం

పుల్లంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని అనంత సముద్రం సమీపంలో కందిరీగల గుట్ట వద్ద మండలానికి చెందిన 12 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి 28 దుంగలను స్వాధీనం చేసకున్నామన్నామని రాజంపేట డీఎస్పీ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో వీరిని పట్టుకుని వారి నుంచి 28 దుంగలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. పట్టుబడ్డ దుంగల విలువ 8 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుంటే ఎంతటివారినైన వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, నందలూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక్కడ పల్లెపండుగ లేదా...?

- అధ్వానంగా రోడ్లు
- వాహనదారులకు తప్పని కష్టాలు
- ప్రభుత్వం నిధులు ఇచ్చినా ఫలితం శూన్యం
- ప్రభుత్వ ఆశయానికి తూట్లు

సుండుపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ నిర్వాకంతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతల మయంగా మారాయి. అభివృద్ధి తుంగలో తొక్కి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్భాటం ప్రకటలనకే పరిమితమైంది. ఇందుకు ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండుగ నాటికి పట్టణాల నుంచి పల్లెలకు వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా పూర్తి చేయాలని పల్లె పండుగ పేరిట కోట్లాది రూపాయల నిధులను విడుదల చేశారు. గత ప్రభుత్వంలో తప్పులు జరిగాయి. ఆ తప్పులను పూడ్చేందుకు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ తీసుకువచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, పాలకులను భాగస్వాములను చేస్తూ రోడ్లు వేసేందుకు నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్ల పల్లె పండుగ పేరిట రోడ్లు వేసి గుంతలు లేకుండా చేస్తున్నారు. అయితే సుండుపల్లె మండలంలో మాత్రం పల్లెపండుగ పనులు ప్రారంభం కాలేదు. సుండుపల్లె మండలంలో రోడ్లు వేసేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులను విడుదల చేశారు. అయినా పనులు ప్రారంభించకపోవడంతో పండుగకు పల్లెలకు వచ్చే స్థానికులు, అతిథులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.



గుంతలుగా మారి వర్షపు నీటితో నిండిన అగ్రహారం నుంచి బలిజపల్లెకు వెళ్లే మట్టి రోడ్డు

### గతంలో హైరానా

సుండుపల్లె మండల కేంద్రంలో సీసీ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, మట్టి రోడ్లు గుంతల మయంగా మారడంతో మండల కేంద్రానికి వచ్చేవారు. పోయేవారు అష్టకష్టాలు పడుతున్నారు. సుండుపల్లె, రాయవరం ప్రధాన రహదారిలో కెనరా బ్యాంకు సమీపంలో ఇళ్లలోని మురికినీరు, వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఎంపీడీవో ఆఫీసు నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో సీసీ రోడ్లు పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి ప్రయాణికులు కిందపడి గాయాలపాలువుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అగ్రహారం నుంచి ఏటిగడ్డరాచపల్లి, బలిజపల్లె, సామిసేనిగడ్డ ఇతర పల్లెలకు వెళ్లే రోడ్లు సుమారు ఐదు కిలోమీటర్ల వరకు గుంతలుగా మారింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర నుంచి సాకలపల్లి, కుమ్మరపల్లి, కొత్త వడ్డెపల్లె, రవీంద్రనాథ్‌రెడ్డి కాలనీ, పోచంపల్లి, పోచంవాండ్లపల్లె, ఎల్లారెడ్డిగారిపల్లెలకు వెళ్లే రహదారులు, అంతేగాకుండా పెద్దిసేనికాలువ గ్రామ పంచాయతీ బత్రాజుగారిపల్లెకు వెళ్లే మట్టి రోడ్లు దశాబ్దాల కాలంగా మట్టి రోడ్లగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో రోడ్లు వేస్తామని తవ్వి గుంతల మయంగా మార్చేశారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా మండల కేంద్రంలో కూడా ఆరెమ్మ వీధి, ఇందిరానగర్, జనార్దన్‌నగర్ కాలనీలో ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. అంతేగాకుండా మూడు సంవత్సరాల క్రితం రాయచోటి నుంచి సుండుపల్లెకు డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అటవీ ప్రాంతంలో అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం పల్లె పండుగ పేరిట నిధులు విడుదల చేసింది. ఈ ప్రభుత్వంలోనైనా రోడ్లు వేస్తారని భావించాము. నిధులు వచ్చినా పనులు ప్రారంభించకపోవడం బాధాకరం అని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలో పనులు ప్రారంభిస్తాము

**-సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె**

త్వరలో పల్లె పండుగ పనులు ప్రారంభిస్తాము. సుండుపల్లె మండలానికి రూ.1.50 కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించింది. పనులు గుర్తించాము. ప్రధాన రోడ్ల సమస్యలు పరిష్కరిస్తాము.

### అప్పుడు ప్రారంభించారని ఆపేశారు

2018 అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ ఆర్‌కే రోడ్డు నుంచి పూజారివాండ్లపల్లె వరకు 1.40 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటుకు రూ.56 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. మూడుచోట్ల కల్వర్టులు నిర్మించారు. సుమారు రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించి పనులు చేశారు. మడితాడు గ్రామంలోని రాయవరం రోడ్డు నుంచి నాయునివారిపల్లెకు పోయే రహదారిలో రూ.62 లక్షలతో 1.50 కిలోమీటర్లు రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.34 లక్షలు వెచ్చించి పనులు చేశారు. అలాగే జీకే రాచపల్లె సమీపంలో రాయవరం రోడ్డు నుంచి కోనేరువాండ్లపల్లెకు రూ.58 లక్షలతో 1.05 కిలోమీటర్లు రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.24 లక్షలు వెచ్చించి పనులు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులన్నింటినీ రద్దు చేసింది. దీంతో రహదారి పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వైసీపీ ప్రభుత్వం రాగానే అర్ధంతరంగా ఆపేసిన రోడ్డు పనులు

### పల్లె పండుగకు రాజకీయ గ్రహణం

వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేవని ప్రభుత్వం ఇవ్వడం లేదని, అభివృద్ధి కుంటుపడిందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా నిధులు విడుదల చేశారు. అందులో భాగంగా సుండుపల్లె మండలానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. నిధులు వచ్చాయని సంబరపడే లోపు టీడీపీలోని నియోజకవర్గ కీలక నేతల మధ్య సఖ్యత లేకపోవడం వలన పల్లె పండుగ పనులు ప్రారంభం కాలేదు. సంక్రాంతి పండుగలోపు గుంతలు లేని రోడ్లుగా మార్చాలని పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేసినా ఇక్కడ మాత్రం పనులే ప్రారంభం కాలేదు. నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఇప్పటికి దాదాపు రోడ్లు పూర్తయ్యేవి. గత ప్రభుత్వంలో చేయలేదని విమర్శిస్తున్నారు. కానీ ఈ ప్రభుత్వంలో నిధులు విడుదల చేసినా పనులు చేయడం లేదని టీడీపీ నేతల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశించినా పనులు చేయకపోవడం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు కూటమి నాయకులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సంక్రాంతి
మరియు జన్మదిన
శుభాకాంక్షలు.
RISING ANDHRA
SHINING ANDHRA
ప్రజా సంక్షేమమే లక్ష్యంగా , చితూరు అభివృద్ధికె నిరంతరం
శ్రామికుడి లాగా ముందుకు సాగుతున్న
చిత్తూరు శాసనసభ్యులు మా ఆత్మీయసోదరుడు
శ్రీ గురజాల జగన్మోహన్ గారికి
హార్థిక జన్మదిన శుభాకాంక్షలు.
N AVENUE BY KONDA & GJM , NUTRINE FACTORY COMPOUND , CHITTOOR
LAUNCHING SOON...
N AVENUE :
* Mall
* 3 Star Hotel
* Luxuary villas
* Commercial Space
* High Rise Appartments
మీ...
కొండా నరేంద్ర MS USA
గ్లోబల్ వెస్ ప్రెసిడెంట్ NIVIDIA సిలికాన్ వ్యాలి ,USA
ప్రముఖ పారిశ్రామిక వేత్త , ప్రకృతి వ్యవసాయ నిపుణులు
తంబళ్ళపల్లి నియోజకవర్గం

# రారండోయ్.. వేడుకచేద్దాం

●భోగి పండుగతో ప్రారంభమైన సంక్రాంతి వేడుకలు ● రంగవల్లులతో అలరిస్తున్న పల్లెలు, పట్టణాలు

మదనపల్లె అర్బన్/పీలేరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రారండోయ్.. వేడుకచేద్దామంటూ..సంక్రాంతి పండుగ వేడుకలను ప్రజ లు ఆనందోత్సాహాలతో అంగరంగ వైభవంగా జరుపుకుంటు న్నారు. సంబరాల్లో తొలి ఘట్టమైన భోగి పండుగను సోమవా రం ప్రజలు వేకువ జామునే సాంప్రదాయబద్ధంగా తమ లోగిళ్ల ముందు భోగి మంటలు వేసి ఇంటిలోని పాత సామగ్రిని అందులోవేసి ప్రజలు సంతోషంగా పండుగకు స్వాగతం పలికారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ భోగి సంబరాల్లో పాల్గొన్నారు. పీలేరు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదుట ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్ సభ్యులు భోగి మంటలు వేసి దాని చుట్టూ కోలాటాలతో పండుగను వైభవంగా జరుపుకున్నారు. స్థానిక పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు, మానవత సంస్థ సభ్యులు భోగి మంటలు వేశారు. అంతకు ముందు సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ తమ ఇంటి గుమ్మాలను అందంగా అలంకరించి మహి ళలు రంగురంగుల రంగవల్లులతో శోభాయమానంగా అలంకరించారు. మదనపల్లెలో భోగి పండుగను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. స్థానిక దేవళంవీధిలో ప్రసన్నవెంకటరమణ స్వామి ఆలయం సమీపంలో భోగిమంటలు వేశారు.

**తంబళ్లపల్లెలో:** తెలుగువారి సంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి పండుగ మొదటి రోజైన భోగి పండుగను సోమవారం మండల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే పెద్ద లు, యువత, పిల్లలు ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు.



కలకడ ఎర్రకోటపల్లెలో భోగి మంటలు

**కలకడలో:**సంక్రాంతిలో భాగమైన భోగి పండుగను మండల ప్రజలు సోమవారం వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా రంగు రంగుల రంగవ ల్లులు వేసి వాటి మధ్యలో గొబ్బెలను ఉంచి పండుగ శోభన సంతరింపజేశారు.

**కురబలకోటలో:** మండలంలో పలు గ్రామాల్లో వేకువ జాము న ప్రజలు తమ ఇళ ముందు భోగి మంటలు వేశారు. అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ ద్వారకనాథ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు.

**గుర్రంకొండలో:**మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండుగ వేడుకలను ప్రజలు సోమవారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఇళ్ల ముంగిట ప్రజలు భోగి మంటలను వేసి ఇళ్లలోని పాత వస్తువులను వేసి భోగి పండుగ ను జరుపుకున్నారు.

## పీటీఎంలో శివపార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పీటీఎంలోని ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యమలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

## కమనీయం.. గోదాదేవి కల్యాణం



మదనపల్లె అర్బన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బర్మావీధిలోని షిర్డిసాయిబాబా ఆలయంలో సోమవారం కన్నుల పండువగా గోదాదేవి కల్యాణాన్ని ఆలయక మిటీ ఉపాధ్యక్షుడు నాదేళ్ల బాబునాయుడు ఆధ్వర్యంలో వైభవంగా కమనీయంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివార్లను ప్రత్యేకంగా ఉత్సవ విగ్రహాలను పెళ్లిపందిరిలో విశేషంగా అలంకరణ చేసి సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. వారు గోదాదేవి కల్యాణం తిలకించడం వరంగా భావించారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాదేళ్ల బాబునాయుడు, మార్పురి నాగార్జున బాబు(గాంధీ), కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల సాయం



హైస్కూల్‌కు కుర్చీలు వితరణ చేస్తున్న పూర్వవిద్యార్థులు

మదనపల్లె అర్బన్, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె మాయాబజారులో వివేకానంద మున్సిపల్ హైస్కూల్ 1996-97లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు సోమవారం ఇక్కడ కలిసి 15 వేలు విలువ చేసే బీరువా, కుర్చీలను స్కూల్‌కు వితరణగా అందించారు. వారిని ఆ పాఠశాల హెచ్‌ఎం పురం వెంకటరమణ అభినందించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు హరిబాబు, ఈనంద, రమేష్, శ్రీనివాస్‌నాయుడు, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీకేపల్లెలోని ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయంలో పేద వృద్ధులకు దుస్తులు వితరణ చేశారు. అనంత చారిటబుల్ ట్రస్టు సభ్యులు శ్రీకాంత్, మునిరత్నం, చంద్రలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పేద వృద్ధులకు దుస్తులను వితరణ చేశారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ స్వాతి చక్రపాణి, సిబ్బంది శంకర య్య, అఖిల తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందేలు నిర్వహిస్తే కేసులు తప్పవు

నిమ్మనపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ తిప్పేస్వామి హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. జూదాలు, కోడిపందేలు నిర్వహించకుండా ముందస్తుగా పోలీసులతో గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పండుగలకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తప్పని సరిగా పోలీసులకు సమాచారం అందజేయాలని పేర్కొన్నారు.

## పేద ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

మదనపల్లె టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా పనిచేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ఏడుగురు లబ్ధిదారులకు రూ.20లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.75లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద వివిధ రకాల జబ్బులకు ఉచితంగా చికిత్సలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, రెడ్డిరామ్‌ప్రసాద్, నరసింహులు, చుక్కా విజయకుమార్, రాటకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ ఉప్పునెల్లి గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణ(80) కనిపించలేదని అతని కుమారుడు ఆంజప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 6తేదీన పించన్ డబ్బులు తీసుకువస్తానని రామసముద్రం వచ్చిన తన తండ్రి తిరిగి ఇంటికి రాలేదని, బంధువులు ఇళ్లలో ఆరా తీసినా ఆచూకి తెలియలేదని ఆంజప్ప ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

## భూవివాదమై ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె అర్బన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి):భూ వివాదంలో ఇరు వర్గాలు ఘర్షణ పడినట్లు గుర్రంకొండ ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపారు. గుర్రంకొండ మండలం తలారివారిపల్లెకు చెందిన ఆనందరెడ్డి వర్గీయులు ఇంటినిర్మాణం చేపడుతుండగా సి. శ్రీనివాసులురెడ్డి వర్గీయులు అడుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. గుర్రంకొండ పోలీసులు కేసు విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బి.కొత్తకోట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతి పరిధిలోని ఇందిరమ్మ కాలనీ శివారులో సోమవారం దిల్షాద్(56) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఆమె కుమార్తె హసీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పేర్కొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

బి.కొత్తకోట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముసుగులో మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, వివిధ రకాల జూదం,పై నిషేధం ఉందన్నారు.

## కులమే దేశానికి ప్రధాన శత్రువు

మదనపల్లె అర్బన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థ దేశానికి ప్రధాన శత్రువని బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. కుల దహనం సభ తీర్మానాలను బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధి సుబ్బారావుతో కలిసి సోమవారం బాస్ కార్యాలయంలో శివప్రసాద్ వెల్లడించారు. కుల వివక్ష వేధింపులపై కఠిన చట్టాలు తేవాలన్నారు.

## కనుమ పండుగకు ఏర్పాట్లు సిద్ధం

పెద్దమండ్యం, జనవరి 13(ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండుగలో భాగంగా పశువుల పండుగైన కనుమ పండుగకునిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. దీంతో కాటంరాజు గుళ్ల వద్ద చిట్లకుప్పలు సిద్ధం చేశారు. ఆ రోజు కాటంరాజు కు ప్రత్యేక పూజలు నిర్వహించి చిట్లకుప్పలు వెలిగిస్తారు. ఆయా గ్రామాల్లో ఇది జాతర ను తలపిస్తుంది.